
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 27 ఆగస్టు 2024
*** గరిష్ఠం 32.0 కనిష్ఠం 23.0



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.80 (311.4474)	66,051	49,338
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	622.21	921.40
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.83 (45.51)	29,765	33,268

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.186 | స్కిన్‌లెస్ : రూ.216

నకిలీలపై చర్యలేవీ?



- రాష్ట్రంలో 11మంది జేఎల్‌లపై ఫిర్యాదులు
- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మందిపై ఆరోపణలు
- తొమ్మిదినెలల క్రితం ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- ఫిబ్రవరిలో సీఐసీఐడీ అదనపు డీజీకి కూడా ఫిర్యాదు
- పైరవీ కోసం వెళ్తే ఘాటుగా మందలించిన మంత్రి

నకిలీ ధ్రువపత్రాలతో లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ పొందినవారిపై చర్యలు కరువయ్యాయి. పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారులకు, సీబీసీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు కొరవడ్డాయి. నకిలీరాయుళ్లపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకులు తమను కాపాడాలని ఇటీవల ప్రభుత్వంలోని ఓ కీలక మంత్రిని కలవగా, ఆయన ఘాటుగా మందలించడంతో పాటు, మరోసారి తనకు కనిపించవద్దని హెచ్చరించినట్లు తెలిసింది. సుమారు తొమ్మిది నెలలుగా వివిధ స్థాయిల అధికారులకు ఫిర్యాదులు చేసి అన్ని ఆధారాలు సమర్పించినా, విచారణ జరిపి చర్యలు తీసుకోకపోవడానికి డబ్బు చేతులు మారాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సదరు అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఎనిమిది మంది, జనగామ, హైదరాబాద్, బోధన్ కాలేజీల్లో పనిచేస్తున్న మరో ముగ్గురు, మొత్తం 11మంది లెక్చరర్లు క్రమబద్ధీకరణ సమయంలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారని, వారిని విధులనుంచి తొలగించడంతో పాటు, చర్యలు తీసుకోవాలని కోరుతూ 2023, డిసెంబరు 18న రాష్ట్ర ప్రభుత్వ విద్యావనరుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి, ఓయూ రీసెర్చ్‌స్కాలర్ వేముల శేఖర్ ఇంటర్ విద్యాశాఖ ఆర్జేడీ, కమిషనర్‌తో పాటు ఆయా జిల్లాల ఇంటర్ విద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు ఆదేశించిన ఆర్జేడీ వాస్తవాలు తేల్చేనిమిత్తం ఆయా జిల్లాల డీఐఈవోలు, సంబంధిత కాలేజీ ప్రిన్సిపాళ్ల నుంచి తమ కార్యాలయానికి సర్టిఫికెట్లు తెప్పించుకున్నారు. ఆ తదుపరి చర్యలు మాత్రం ఇప్పటివరకు తీసుకోలేదు. వీరిపై నమోదయిన కేసు విచారణలో ఉన్నందున,వార్షిక ఇంక్రిమెంట్ నిలిపివేయాలని ఆర్జేడీ సంబంధిత డీఐఈవోలు, ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులివ్వడంతో వీరికి ఒక ఇంక్రిమెంట్ నిలిచింది. అంతకుమించి చర్యల విషయంలో ముందడుగు పడకపోవడం గమనార్హం. నకిలీ సర్టిఫికెట్ల విచారణ ముందుకు జరగకుండా, చర్యలు తీసుకోకుండా కమిషనరేట్ స్థాయిలోని ముఖ్య అధికారులే ఈ తతంగం నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై ఫిర్యాదు చేసిన ఆర్టీఐ కార్యకర్త, ఉన్నతాధికారులను ఎన్ని పర్యాయాలు కలిసినా విచారణ నిర్వహిస్తున్నామనే సమాధానం తప్ప చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు. ఇంటర్‌బోర్డు అధికారులతో పాటు సీబీసీఐడీ అదనపు డీజీకి కూడా ఈ నకిలీ సర్టిఫికెట్ల అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిబ్రవరిలో ఫిర్యాదు చేశామని, ఆ విభాగం నుంచి కూడా ఎలాంటి విచారణ జరిగిందనే విషయంలో స్పష్టత లేదని ఫిర్యాదుదారు శంకర్ పేర్కొన్నారు.

నకిలీలపై అన్ని ఆధారాలతోనే ఫిర్యాదులు

నకిలీ ధ్రువపత్రాలతో జూనియర్ లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ పొందారనే అంశంపై ఇచ్చిన ఫిర్యాదుదారు అన్ని ఆధారాలను సమర్పించారు. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మందిపై ఫిర్యాదులున్నాయి.

- యాదాద్రి జిల్లా రామన్నపేటలో పనిచేస్తున్న, ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్ కేవలం పదోతరగతి మాత్రమే పాసయ్యారని, ఆమె అలహాబాద్‌కు చెందిన హిందీ సాహిత్య సమ్మేళన్ సంస్థ ద్వారా జారీ అయిన సర్టిఫికెట్‌ను సమర్పించారని, ఈ సంస్థకు యూనివర్సిటీ హోదా లేదని, ఏ అథారిటీ కూడా ఈ సంస్థను గుర్తించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం సేలంలోని వినాయకమిషన్ డీమ్డ్ యూనివర్సిటీ నుంచి పీజీ చేసినట్లు హాలియాలో పనిచేసే ఓ లెక్చరర్ సర్టిఫికెట్ సమర్పించారని, అయితే ఈ యూనివర్సిటీకి ఆ సమయానికి యూజీసీ గుర్తింపులేదని, పైగా సదరు యూనివర్సిటీ పీజీలో జువాలజీ కోర్సునే నిర్వహించడం లేదు కాబట్టి, అది నకిలీ సర్టిఫికెట్ అని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- నల్లగొండలో ఓ అధ్యాపకుడు పదోతరగతి మెమోలో పుట్టినతేదీని మార్పు చేశారని, అంతేకాకుండా బోనఫైడ్ సర్టిఫికెట్‌లో, ఆధార్‌కార్డులో పుట్టినతేదీ వివరాలతో సరిపోలడం లేదని, తక్కువ వయసు చూపించుకునేందుకు ఈ తప్పు చేశారని పేర్కొన్నారు.
- నల్లగొండకే చెందిన మరో జూనియర్ లెక్చరర్ పది నుంచి పీజీ వరకు ఎక్కడా ఉర్దూ మీడియంలో చదవకున్నా ఉర్దూ మీడియం లెక్చరర్‌గా క్రమబద్ధీకరించారని, ఇది నిబంధనలకు విరుద్ధమని, పైగా ఆయన మధ్యప్రదేశ్ భోజ్‌యూనివర్సిటీ (ఓపెన్), ఖమ్మం స్టడీ సెంటర్ నుంచి పీజీ చేసినట్లు సర్టిఫికెట్ సమర్పించారని, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రాదేశిక పరిధిలో లేని ఓపెన్ యూనివర్సిటీలో చేసే కోర్సులకు ఇక్కడ చెల్లుబాటు లేదని, ఆ ప్రకారం ఈ నియామకం చెల్లదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న మరో అధ్యాపకుడు పదో తరగతి మెమోలో పుట్టిన తేదీ, పుట్టుమచ్చల వివరాలు మార్చారని, పుట్టిన తేదీని చేతిరాతతో రాశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడు సమర్పించిన మెమో ప్రకారం పుట్టిన తేదీ 29, ఫిబ్రవరి 1970గా పేర్కొన్నారని, అయితే ఆ సంవత్సరం ఫిబ్రవరిలో 28వ తేదీ మాత్రమే ఉందని, స్పష్టంగా సర్టిఫికెట్‌ని దిద్దిన విషయం ఇక్కడ స్పష్టమవుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆధార్, పాన్‌కార్డుల్లో ఉన్న పుట్టిన తేదీలతో ఇది సరిపోలడం లేదని కూడా వివరించారు. పీజీ కాన్వకేషన్ సర్టిఫికెట్‌ను కూడా చేతిరాతతో రాశారని, అంతేకాకుండా రూల్‌నెంబర్, కోర్సునేమ్, సబ్జెక్ట్ పేరు, డివిజన్ వివరాలేవీ అందులో లేవని, దీంతో ఇది నకిలీ సర్టిఫికెట్ అని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- నల్లగొండలోనే పనిచేస్తున్న మరో అధ్యాపకుడు పదో తరగతి నుంచి పీజీ వరకు ఎక్కడా ఉర్దూ మీడియంలో చదవుకున్నా ఉర్దూ మీడియం లెక్చరర్‌గా నియమించారని, తెలంగాణ ప్రాదేశిక పరిధిలోలేని ఓపెన్‌యూనివర్సిటీ నుంచి పీజీ సర్టిఫికెట్ సమర్పించారని పేర్కొన్నారు. అతడు సమర్పించిన పీజీ, డిగ్రీ కాలేజీల పేర్లు ఎక్కడా సరిపోలడం లేదని, పాట్నాలోని ఏఎన్‌కాలేజీలో ఆ సమయంలో ఫిజిక్స్ కోర్సేలేదని, తప్పుడు సర్టిఫికెట్ సమర్పించారని పేర్కొన్నారు.
- నల్లగొండలోనే పనిచేస్తున్న మరో లెక్చరర్ తాను జార్ఖండ్ రాష్ట్రంలోని రాయపూర్‌లోని కళింగ యూనివర్సిటీ నుంచి దూరవిద్యావిధానంలో పీజీ చేసినట్లు సర్టిఫికెట్ సమర్పించారు. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో పాటు, సదరు యూనివర్సిటీ దూరవిద్యలో ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) కోర్సును నిర్వర్తించడం లేదని, అది బోగస్ సర్టిఫికెటనని పేర్కొన్నారు.
- అదేవిధంగా నల్లగొండలోని ఒకేషనల్ కాలేజీలో పనిచేస్తున్న మరో లెక్చరర్ తమిళనాడులోని యూనివర్సిటీ నుంచి కోర్సు పూర్తిచేసిన సర్టిఫికెట్ సమర్పించారు. వీరితో పాటు ఇతర జిల్లాల్లోని మరో ముగ్గురిపై ఆరోపణలు ఉన్నాయి.

రెండు నెలల క్రితమే సర్టిఫికెట్లన్నింటినీ ఉన్నతాధికారులకు పంపాం

జిల్లాలో నకిలీ ధ్రువపత్రాల ఆరోపణలున్న లెక్చరర్లకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లను పరిశీలన నిమిత్తం ఉన్నతాధికారులకు పంపాం. రెండు నెలల క్రితమే వాటన్నింటినీ సమర్పించాం. ఈ ఫిర్యాదుల అంశం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం మేం తదుపరి చర్యలు తీసుకుంటాం.

- దస్రునాయక్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

వివాదాస్పద అధ్యాపకుడిపైనా చర్యలు కరువే

ఓ వైపు నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై చర్యలు తీసుకోవడంలో వెనకంజవేస్తున్న ఉన్నతాధికారులు, మరోవైపు పనిచేసే ప్రదేశంలో లెక్చరర్లకు సానుకూల వాతావరణం కల్పించడంలోనే వైఫల్యం చెందుతున్న పరిస్థితి నెలకొంది. నల్లగొండ జిల్లాలోని ఓ నియోజకవర్గ కేంద్ర జూనియర్ కళాశాలలో పనిచేసే ఓ లెక్చరర్ సహచర లెక్చరర్లపై దురుసు ప్రవర్తనతో పాటు, అసభ్యకర ప్రవర్తనతో వేధిస్తున్న విషయాలపై ఎన్ని పర్యాయాలు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడంపైనా విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రబుద్ధుడిపై గతంలో ఓ మహిళా లెక్చరర్ షీటీమ్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కౌన్సిలింగ్ తర్వాత రాతపూర్వకంగా వివరణ తీసుకున్నా ప్రవర్తనలో మార్పురాలేదని, ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సదరు మహిళా లెక్చరర్ స్థానికతను సైతం పక్కనపెట్టిమరీ పొరుగు జిల్లాకు బదిలీ చేయించుకొని వెళ్లిపోయారని, ఇలాంటి అధ్యాపకులపై అంతర్గత విచారణ జరపడానికి, చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు ఎందుకు వెనకంజ వేస్తున్నారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇక్కడా 'హైడ్రా' కావాలి

- చెరువుల పరిరక్షణకు జిల్లాల్లో ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖరాసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్లగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): చెరువుల పరిరక్షణ, చెరువుల్లో కబ్జాలు, ఆక్రమణలు తొలగించేందుకు జిల్లాలు, నియోజకవర్గాల్లోనూ హైడ్రా తరహా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. సోమవారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. భూముల ధరలు పెరగడంతో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను రియల్‌ఎస్టేట్ వ్యాపారం కోసం ఆక్రమించి, వెంచర్లు, లేఅవుట్లు వేసి చెరువులను ధ్వంసం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ ఆక్రమణలతో చెరువులు, కుంటలు రూపం కోల్పోయి, నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో భూగర్భజలాలు అడుగంటి, ప్రజ లు తాగునీటికి సైతం ఇబ్బందిపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో 70కిలోమీటర్ల మేర జాతీయరహదారి విస్తరించి ఉందని, ఇరువైపులా ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని పరిరక్షించేందుకు, ఆక్రమణ లు తొలగించేందుకు హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. తన నియోజకవర్గంలో నిజాం కాలం నుంచి ఉన్న గొలుసుకట్టు చెరువులను ఆక్రమణదారులు ధ్వంసం చేసి రూపం లేకుండా చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరంలో చెరువుల పరిరక్షణకు హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని అభినందించారు. పూర్వం రోజుల్లో యేరు వచ్చి ఊరుమీదపడితే ఊరు మునిగిందని వినేవారమని, అయితే ఇప్పుడు ఆక్రమణలో ఊరే చెరువుల్లోకి వెళ్లిన పరిస్థితి దాపురించిందని, దీన్ని సరిచేసేందుకు సీఎం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలంతా హర్షిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే తరహాలో జిల్లాలు, నియోజకవర్గాల్లోనూ చెరువులు, కుంటల పరిరక్షణకు వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని అన్ని చెరువులకు పునర్జీవం పోయాలని లేఖలో సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే వీరేశం కోరారు.

నేటి నుంచి రుణమాఫీ

అర్జీలపై సర్వే

- తుది యాప్‌తో పాటు మార్గదర్శకాల జారీకి ఏర్పాట్లు
- రైతు వేదికల ద్వారా సందేశాల అనంతరం ప్రక్రియ మొదలు
- ఉమ్మడి జిల్లాలో 50వేలకు పైగా దరఖాస్తులు
- రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రం

•6లో..



యాదగిరికొండపై హరిహరులకు పూజలు

•7లో..

మదర్ డెయిరీలో ఆరు డైరెక్టర్ పదవుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

•7లో..

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బడ్జెట్‌లో షెడ్యూల్డ్ తెగలకు

రూ.345కోట్లు

ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్యనాయక్



ట్రైకార్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎల్‌ఏహెచ్‌పీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 26: వివిధ పథకాల కింద షెడ్యూల్డ్ తెగలకు ప్రయోజనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.345కోట్లు కేటాయించిందని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ ట్రైబల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో పర్యటించి ఐటీడీఏల్లో సమావేశాలు నిర్వహించి గిరిజనుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. ఈనెల 30న హైదరాబాదులో రాష్ట్రస్థాయిలో గిరిజన సంఘాల నాయకులతో చర్చించి వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. 31న గిరిజన ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తామని, సెప్టెంబరు 1న బడ్జెట్‌లో కేటాయించిన రూ.350కోట్ల నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేసే విషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అక్టోబరులో ఆర్థిక చేయూత, చిన్న, మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహ పథకం, భూ అభివృద్ధి పథకాల కింద లబ్ధిదారుల ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి నవంబరులో ఆర్థిక సహాయం అదిస్తామన్నారు. గత ప్రభుత్వ హయంలో గిరిజనుల అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. గత ప్రభుత్వం ట్రైకార్ కింద ఎంపిక చేసిన వారికి సహకారం అందించేందుకు తమ ప్రభుత్వం రూ.426కోట్లు మంజూరు చేయడమేగాక, రూ.410కోట్లు విడుదల చేసిందన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న యూనిట్లన్నింటినీ మంజూరు చేస్తామన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కులు కల్పిస్తామన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 25లక్షల ఎకరాల అసైన్డ్ భూములు పంచారని, వాటన్నింటికీ పూర్తిస్థాయి పట్టాలు, హక్కులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, ఆర్డీవో రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గోర్ బోలీ భాషను అధికారిక భాషగా ప్రకటించాలి

దేశంలోని సుమారుగా 14కోట్ల మంది మాట్లాడే గోర్ బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చి అధికారిక భాషగా ప్రకటించాలని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ డిమాండ్ చేశారు. లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రునాయక్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సన్మానంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ప్రతీ రూపాయి వారికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షం నాయక్, జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్, నాగేశ్వరరావునాయక్, మెగావత్ సురేందర్ నాయక్, రాజేష్ నాయక్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి



నల్లగొండలో ఆర్టీసీ కాలనీలో స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో సందడి చేశారు. సాయంత్రం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. •8లో..

కొనసాగుతున్న అంతర్జాతీయ టెన్నిస్ సిరీస్

రెండో రోజు 51 మ్యాచ్‌లు



టెన్నిస్‌లో పోటీపడుతున్న బాలిక

భువనగిరి టౌన్, ఆగస్టు 26: రాజా నర్సింహరావు, మెమోరియల్ ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్(ఐటీఎఫ్) అంతర్జాతీయ జూనియర్స్ అండర్ -18 పోటీలు భువనగిరిలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. దేశ, విదేశాలకు చెందిన 170మంది క్రీడాకారులు పాల్గొంటున్న సిరీస్‌లో రెండో రోజైన సోమవారం పలు కేటగిరీల్లో 51 మ్యాచ్‌లు ఆడారు. విజయం కోసం ఎనిమిది గ్రౌండ్‌లలో క్రీడాకారులు చెమటోడ్చారు. బాలుర విభాగంలో ఇండియాకు చెందిన అంకిత్‌రెడ్డి ఆస్ట్రేలియా క్రీడాకారుడు మన్యూరెడ్డి 6-4, 7-6 సెట్లతో గెలుపొందాడు. బాలికల విభాగంలో రాగినేని కీర్తన ఆస్ట్రేలియాకు చెందిన అరవింద మైరాపై 6-0, 7-5 సెట్స్‌తో గెలుపొందారు. అలాగే అమెరికాకు చెందిన అధితి పాతూరి ఇండియాకు చెందిన మందగల్ల ప్రిన్సిపై వరుస సెట్లతో విజయం సాధించింది. మిగతా మ్యాచ్‌లన్నీ ఇండియా క్రీడాకారుల మధ్యనే సాగాయి. రోజంతా సాగిన పోటీలను స్థానికులు తిలకిస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ముఖ్యంగా క్రీడాకారుల వెంట వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించిన విధానం, ఓడిన వారిని ఓదార్చిన తీరు అందరినీ ఆకట్టుకోగా, ఆ ప్రాంతమంతా టెన్నిస్ అభిమానులతో కోలాహలం నెలకొంది. ఈ నెల 25వ తేదీన మొదలైన పోటీలు సెప్టెంబరు 1వ తేదీన ముగియనుండగా, నెల రోజుల తర్వాత విజేతల ర్యాంకులను ఐటీఎఫ్ విడుదల చేస్తుంది.

విధుల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

చింతపల్లి, ఆగస్టు 26: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని వేంకటేశ్వరనగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చూపితే సహించేది లేదని, చర్యలు తప్పని హెచ్చరించారు. ఆయన వెంట క్లస్టర్ అధికారి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రవీణ్‌కుమార్ పెళ్లినాటి ఫొటో (ఫైల్)

మారుమూల గ్రామం నుంచి

అగ్రరాజ్యానికి వెళ్లి..

- జిల్లావాసి మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు
- పలు దేశాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్
- మృతదేహాన్ని తరలించేందుకు ప్రభుత్వం సహకరించాలని వేడుకుంటున్న తండ్రి

•7లో..



నేటి నుంచి 'రుణమాఫీ' సర్వే

● తుది యాప్‌తో పాటు మార్గదర్శకాల జారీకి ఏర్పాట్లు
● రైతు వేదికల ద్వారా సందేశాల అనంతరం ప్రక్రియ మొదలు
● ఉమ్మడి జిల్లాలో 50వేలకు పైగా దరఖాస్తులు
● రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రం



నల్లగొండ, ఆగస్టు 26: అర్హత ఉండి వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించని రైతుల వివరాల నమోదుకు వ్యవసాయశాఖ మంగళవారం నుంచి క్షేత్రస్థాయి సర్వే చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. రుణమాఫీ కాని రైతుల వివరాలు నమోదు చేసేందుకు యాప్‌తో పాటు మార్గదర్శకాల జారీకి రాష్ట్ర వ్యవసాయశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. సర్వే ప్రారంభ రోజే రైతు వేదికల ద్వారా రాష్ట్ర స్థాయి నుంచి ఉన్నతాధికారులు విధివిధానాలను, యాప్‌ను ప్రకటిస్తారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయ, డివిజన్, మండల అధికారులకు, మండల విస్తరణ అధికారులకు తాత్కలికంగా రైతుల భరోసా పంట రుణమాఫీ కోసం రూపొందించిన యాప్‌ను పంపారు. మంగళవారం ఉదయం 11గంటలకు ఫైనల్ యాప్‌తో పాటు మార్గదర్శకాలు వెల్లడించిన అనంతరం క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తారు. ఈ సర్వేకు ఎలాంటి కటాఫ్ డేట్‌ను పెట్టలేదు. సర్వే సందర్భంగా రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవడంతో పాటు స్థానిక పంచాయతీ కార్యదర్శుల సంతకాలు తీసుకుంటారు. యాప్‌లో కొందరు రైతుల వివరాలను ప్రయోగాత్మకంగా నమోదు చేసి పరిశీలించనున్నారు.

50వేలకు పైగా దరఖాస్తులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రుణమాఫీ పెండింగ్‌లో ఉన్నవారు గ్రీవెన్స్‌ల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 50వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్క నల్లగొండ జిల్లాలో 30వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. రుణమాఫీకి కుటుంబ సభ్యులను నిర్ధారించే బాధ్యతను ప్రభుత్వం రైతులకే అప్పగించింది. స్వీయ ధ్రువీకరణతో రైతులే వారి కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ నెంబర్‌లు, ఇతర వివరాలను అందజేయాల్సి ఉంటుంది. స్వీయ ధ్రువీకరణలో తప్పులు ఉంటే రుణమాఫీ మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. డిక్లరేషన్‌లో రైతులు సంతకం చేసి తమ మొబైల్ నెంబర్‌ను అందజేయాలి. కుటుంబం నిర్ధారణ కాని రైతుల ఖాతాలు, ఆధార్ నెంబర్లు తప్పుగా ఉంటే వాటిని సరిదిద్దుతారు. యాప్‌లో వివరాల అప్‌లోడ్‌కు మండల వ్యవసాయ అధికారులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు. రుణమాఫీ పొందని రైతుల అభ్యంతరాలను ఏవోలు ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు.

యాప్‌లో 8 దశల్లో వివరాల నమోదు


ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో రైతుల వివరాలను నమోదు చేయడానికి 8 దశలను నిర్దేశించారు. క్రాప్ లోన్ వీవర్ బటన్‌ను క్లిక్ చేసి మొబైల్ నెంబర్ ఆధారంగా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి మూడో దశలో రైతుల వ్యవసాయ రుణం, బ్యాంకుల వివరాలను అనంతరం రైతు పేరు లేదంటే ఆధార్ నెంబర్ సెర్చ్ చేస్తే పూర్తి వివరాలు వస్తాయి. అందులో పేర్కొన్న కాలమ్స్‌లో కుటుంబ సభ్యుల వివరాలను అందజేయాలి. చివరగా ప్రివ్యూలో ఎవైనా తప్పులు ఉంటే సరిచేసేందుకు ఎడిట్ ఆప్షన్ ఉంటుంది. కుటుంబ సభ్యుల గ్రూపు ఫొటోను, స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేస్తారు. ఇదిలా ఉంటే రూ.2లక్షలు రుణం దాటిన వారికి అదనపు మొత్తాన్ని వసూలు చేసేందుకు బ్యాంకులకు వ్యవసాయశాఖ అనుమతి ఇచ్చింది. రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేసిన ప్రతీ ఇంటికి వ్యవసాయ శాఖ అధికారులు వెళ్లి వివరాలు తీసుకుంటారు.

దరఖాస్తు చేసిన ప్రతీ ఇంట్లో సర్వే



రుణమాఫీ కోసం దరఖాస్తు చేసిన ప్రతీ ఇంటికి వ్యవసాయశాఖ అధికారులు వెళ్లి సర్వే చేస్తారు. ఆయా గ్రామాలకు వెళ్లే ముందు సమాచారం ఇస్తాం. రుణమాఫీకి అర్జీ పెట్టుకున్న కుటుంబ సభ్యులంతా అందుబాటులో ఉండి సద్వినియోగం చేసుకోవాలి. నోడల్ అధికారితో పాటు వ్యవసాయ అధికారులు సర్వే సందర్భంగా అందుబాటులో ఉంటారు. అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ చేయడం కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది.

పి.శ్రవణ్ కుమార్, నల్లగొండ జేడీఏ



రుణమాఫీ వర్తించని అబ్బయ్య

● చిట్యాల రూరల్: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మర్రి అబ్బయ్య గ్రామంలోని ఎస్‌బీఐలో గత ఏడాది అక్టోబరు 9న రూ.75,400 వ్యవసాయ రుణం తీసుకున్నాడు. వడ్డీతో కలిపి రూ.80,838వేలు కాగా, ఈ ఏడాది అక్టోబరులో రెన్యువల్ చేయాల్సి ఉంది. గత ఏడాది డిసెంబరు 9వ తేదీ వరకు వ్యవసాయ రుణాలను తీసుకున్న రైతులకు మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించి మూడు విడతల్లో ప్రక్రియను పూర్తిచేయగా, అబ్బయ్య రుణం మాత్రం మాఫీకాలేదు. అయితే అబ్బయ్య బ్యాంక్ ఖాతాకు రెండు ఆధార్ ఐడీలు జతచేసి ఉన్నాయని దీన్ని సరిచేసి పరిష్కరిస్తామని మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు తెలిపారు.

● నార్కట్‌పల్లి: మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన బాసాని ఊర్మిళకు అదే గ్రామ పరిధిలో 0.38 గుంటల వ్యవసాయ భూమి ఉంది. గత ఏడాది ఆగస్టులో స్థానిక ఏపీజీవీబీలో పంట రుణం తీసుకోగా, వడ్డీతో కలిపి రూ.52,960కు చేరింది. మూడు విడతల్లో కూడా ఆమె రుణం మాఫీ కాలేదు. ఎందుకు మాఫీ కాలేదని పరిశీలించగా, ఆధార్‌కార్డు, రుణఖాతాలోని పేరు వేరుగా ఉన్నాయని తేలింది. అయితే ఆమె ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకంలోని పేర్లలో ఎక్కడా అక్షర దోషం లేదు. ఎక్కడ సమస్య ఎదురైందో పరిశీలించి పరిష్కరిస్తామని మండల వ్యవసాయాధికారి శిరీష తెలిపారు.

ఇలా పలు కారణాలతో రుణమాఫీ పొందని వారి కోసం ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ ద్వారా దరఖాస్తులు తీసుకొని సర్వే నిర్వహించేందుకు నిర్ణయించింది.

ప్రవీణ్‌కుమార్ మృతితో స్వగ్రామంలో విషాదం

● మృతదేహం కోసం తల్లిదండ్రులు ఎదురు చూపులు ● ఇంకా రాని పోస్టుమార్టం నివేదిక

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 26: మారుమూల గ్రామం నుంచి అగ్ర రాజ్యంలో బోధన స్థాయికి ఎదిగిన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్‌కు చెందిన తప్పి ప్రవీణ్‌కుమార్ మృతి ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తల్లిదండ్రులు గ్రామంలో చిన్న బడ్డీకొట్టు నిర్వహించుకుంటూ ప్రవీణ్‌కుమార్‌ను ఎమ్మెస్సీ ఫిజిక్స్ వరకు చదివించారు. ఆమెరికాలోని న్యూమెక్సికోలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం తన ఇంటికి సమీపంలో స్విమ్మింగ్‌పూల్‌కు కూతవేటు దూరంలో ఉన్న దోబీఘాట్‌కు దుస్తులు ఉతికించుకోవడానికి వెళ్లాడు. గంట సమయం దాటినా భర్త రానందున భార్య శాంతి స్విమ్మింగ్‌పూల్ వద్దకు వెళ్లింది. అక్కడ ప్రవీణ్ కుమార్ లేడు. కారు ఉంది. వెంటనే ఆమె భర్త మిత్రులకు ఫోన్ చేసి సమాచారం అందించింది. అందరూ కలిసి వెతకగా ప్రవీణ్ కుమార్ మృతదేహం స్విమ్మింగ్ పూల్‌లో కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టానికి తీసుకు వెళ్లారు. స్విమ్మింగ్‌పూల్ ఎక్కువ లోతు కూడా లేదని, ప్రవీణ్ కుమార్‌కు ఈత కూడా వచ్చని భార్యతో పాటు తల్లిదండ్రులు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే ప్రవీణ్‌కుమార్ మృతికి కారణాలు తెలుస్తాయని భార్య, తల్లిదండ్రులు భావిస్తున్నారు. కుమారుడి మృతదేహాన్ని పాతర్లపహాడ్ తీసుకువచ్చేలా ప్రభుత్వం సహకరించాలని మృతుడి తండ్రి నాగయ్య కోరుతున్నారు. ప్రవీణ్‌కుమార్ పాఠశాల విద్యను స్వగ్రామంలో, ఇంటర్, డిగ్రీ, సూర్యాపేటలో పూర్తి చేశాడు. భువనగిరిలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేశాడు అనంతరం హైదరాబాద్‌లోని భాష్యం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఈ తర్వాత సౌదీకి వెళ్లి అబుదాబిలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేశాడు. 2017లో గుజరాత్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఆ సమయంలో అమెరికాలో ఉంటున్న గుజరాత్ కుటుంబ సభ్యులకు ట్యూషన్ చెప్పేవాడు. ఈ సమయంలో ఆ ఎన్ఆర్ఐ కుటుంబం ప్రోత్సాహంతో ప్రవీణ్‌కుమార్ అమెరికాకు 2019లో వెళ్లాడు. అట్లాంటాలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడకు చెందిన శాంతితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ స్వదేశానికి వచ్చి ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకుని అనంతరం అమెరికాకు వెళ్లారు. అట్లాంటా నుంచి జార్జియాలో ప్రవీణ్‌కుమార్ పనిచేశాడు.. ఇటీవల న్యూమెక్సికోలోని ఓ పాఠశాలలో చేరి బోధన చేస్తున్నారు. ప్రవీణ్‌కుమార్ మృతి వార్త కుటుంబ సభ్యుల్లో, మిత్రుల్లో తీరని విషాదాన్ని నింపింది.


మిత్రులతో ప్రవీణ్‌కుమార్


భార్య శాంతితో ప్రవీణ్‌కుమార్

23క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల, ఆగస్టు 26: అక్రమంగా తరలిస్తున్న 23క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ గ్రామానికి చెందిన కాస వీరభద్రయ్య చుట్టుపక్కల గ్రామాలు, తండాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. ఈ రేషన్ బియ్యాన్ని డీసీఎంలో మద్దిరాల మండల కేంద్రం నుంచి నర్సింహులపేట మండలం నర్సింహులగూడెం గ్రామంలోని రాజరాజేశ్వరీ రైస్ మిల్లు యజమాని మేకపోతుల గోవర్ధన్‌రెడ్డి విక్రయించేందుకు తరలిస్తుండగా మద్దిరాల గ్రామ శివారులో సోమవారం పట్టుకున్నారు. వీరభద్రయ్య, మేకపోతుల గోవర్ధన్‌రెడ్డి, డీసీఎం డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరిపై హత్యాయత్నం కేసు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 26: పాత కక్షల నేపథ్యంలో ఇద్దరిపై ఆదివారం దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మికల్ గ్రామానికి చెందిన వీరబోయిన భరత్‌తో గత ఏడాది గ్రామంలో పండుగ సందర్భంగా పెద్దింటి సైదులు గొడవ పడి దాడి చేశాడు. పాత గొడవకు మనసులో పెట్టుకుని వీరబోయిన భరత్, శివ బైకుతో టక్కరు ఇచ్చి సైదులు, వేల్పుల వంశీతో గొడవ పడ్డారు. అనంతరం భరత్, శివలు మద్యం తాగడానికి ఆత్మకూర్(ఎస్) గ్రామ శివారుకు వచ్చి మాట్లాడుకుందామని సైదులుకు, వంశీకి ఫోన్ చేసి పిలిచారు. సైదులును శివ పట్టుకోగా, సగం వరకు ధ్వంసం బీరు బాటిల్‌తో భరత్ పొడిచాడు. ఈ ఘటనలో సైదులు మెడ మీద గాయం కాగా, అడ్డుకోబోయిన వేల్పుల వంశీని ఛాతిపై పొడిచాడు. భరత్, శివపై హత్యాయత్నం కేసు నమోదు చేసి బీరు సీసా, పల్సర్ బైకును స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోదాడ రూరల్, ఆగస్టు 26: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడ ఏఎస్ఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దోరకుంట గ్రామానికి చెందిన రాముడు(32) ఈ నెల 20వ తేదీ వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా, అదే గ్రామశివారులోని ఎఫ్‌సీఐ గోదాం వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రాముడును హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

డేంజర్ బెల్స్ మోగిస్తున్న డెంగీ జ్వరాలు

● హుజూర్‌నగర్‌లో పెరుగుతున్న కేసులు ● రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు ● డెంగీతో ఇప్పటికే ఎనిమిది మంది మృతి

హుజూర్‌నగర్, ఆగస్టు 26: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతంలో డెంగీ జ్వరాల కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఏ ఆసుపత్రిలో చూసినా రోగులు కిటకిటలాడుతున్నారు. డెంగీతో సోమవారం హుజూర్‌నగర్‌కు చెందిన వర్షిత్(13)మృతి చెందాడు. డెంగీతో వారం రోజుల క్రితం హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన జుబేదా(6) మృతి చెందింది. ఇటీవల లింగగిరిలో ఇద్దరు, బూరుగడ్డలో ఇద్దరు డెంగీతో మృతి చెందారు. అదేవిధంగా లింగగిరిలో ఒక కానిస్టేబుల్ డెంగీతో మృతి చెందారు.. లింగగిరి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు డెంగీతో మృతి చెందారు. పట్టణంలోని పాత గోదాంబజారుకు చెందిన వర్షిత్ వారంరోజుల పాటు డెంగీతో పోరాడి మృతి చెందాడు. డెంగీ జ్వరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని డాక్టర్లు తెలిపారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రతి రోజూ డెంగీ జ్వరాలతో చికిత్స కోసం వందల మంది వస్తున్నారు. పలువురు డాక్టర్లు కూడా డెంగీ జ్వరాలతో బాధపడుతున్నారు.

ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ పట్టణంలో, మండలంలోని అనేక గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగాలేనందున డెంగీ జ్వరాలు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. హుజూర్‌నగర్‌లో 28వార్డులు ఉండగా, 50వేల జనాభా, 38వేల ఓటర్లు ఉన్నారు. మండలంలో సుమారు 16వేల మంది ఓటర్లు, 25వేల జనాభా ఉంది.. ప్రతి ఇంట్లో ఒకరిద్దరికి జ్వరాలు వస్తూ, ఇంటిల్లిపాదికీ సోకుతున్నాయి. ముఖ్యంగా డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డబుల్ టైఫాయిడ్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు వచ్చిన వారికి 10రోజుల నుంచి 20రోజుల వరకు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు.

రోగుల అవస్థలు..

జ్వరం వచ్చిన రోగులకు కాళ్లు, కీళ్లు, కీళ్ళు, మొకాళ్ల నొప్పులు. దద్దుర్లు రావడం. ముఖం వాచిపోతున్నాయి. ముఖ్యంగా హుజూర్‌నగర్ పట్టణం, మండలంలో టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగీ స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణంలోని మునిసిపాలిటీ పరిధిలోని అనేక మురికివాడలతో పాటు, గోవిందాపురం, మల్లన్ననగర్, అంబేడ్కర్ కాలనీ, టీచర్స్ కాలనీ, పాత గోదాం బజార్, శ్రీనగర్ కాలనీ, ఎన్ఎస్పీ క్యాంపు, చింతల బజారు, సీతారాంనగర్ కాలనీ తదితర ప్రాంతాలలో అత్యధికంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయి. హుజూర్‌నగర్‌లో సుమారు 15ప్రైవేటు ఆసుపత్రులు ఉండగా ఏ ఆసుపత్రిలో చూసినా ప్రతిరోజు 100 ఓపీలు చేస్తూ వారిలో 70మందికి డెంగీ జ్వరాలు ఉంటున్నాయని వైద్యులు తెలిపారు. పట్టణంలో సుమారు 50మంది ఆర్ఎంపీలు ఉండగా, వారి వద్దకే నిత్యం జ్వర బాధితులు పెద్ద సంఖ్యలో వస్తూ చికిత్స తీసుకుంటున్నారు. పట్టణంలోని 100పడకల ఆసుపత్రిలో జ్వరం బాధితులు లెక్కకు మించి ఉన్నారు. కొంతమంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌ల్లో డెంగీ పరీక్షలు చేస్తున్నారు. డెంగీ, చికన్‌గున్యా, టైఫాయిడ్ పరీక్షలతో పాటుగా ప్లేట్‌లెట్స్ పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా రోగులు కిటకిటలాడుతున్నారు. హుజూర్‌నగర్‌లో విష జ్వరాలతో బాధపడుతున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికి అధికార యంత్రాంగం నామమాత్రపు చర్యలు తీసుకుంటుందనే విమర్శలు ఉన్నాయి.

● హుజూర్‌నగర్‌లోని పీర్లచావిడి సెంటరులో డెంగీతో బాధపడుతున్న కుటుంబాన్ని 10రోజుల క్రితం కలెక్టర్ తేజస్‌నందాలాల్‌పవార్, డీఎంహెచ్‌వో కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్‌వో పరిశీలించారు. లింగగిరిలో బాలిక జుబేదా మృతి చెందగా ఆ కుటుంబాన్ని కూడా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పరామర్శించారు. ఇదిలా ఉండగా ముఖ్యంగా డెంగీ, విష జ్వరాలకు సంబంధించి హాట్‌స్పాట్ కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా పట్టణంలో అనేక ప్రాంతాల్లో స్లమ్ ఏరియాలలో మునిసిపల్ అధికారులు గుర్తించిన దాఖలాలు లేవు. ఒక వార్డులో నాలుగైదు బజార్లు ఉండగా మొక్కుబడిగా ఒక బజారుకు వచ్చి దోమల నివారణ మందు స్ప్రే చేసి మిగిలిన నాలుగు బజార్లను పట్టించుకోవడం లేదు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడ చల్లడం లేదు. స్లమ్ ఏరియాల్లో మురుగు కాల్వలను కూడా శుభ్రం చేయడంలేదు. ఇళ్ల మధ్య అనేక వార్డుల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు, నీటి నిలువ ఉన్న గుంతలను శుభ్రం చేయడంలేదు. కలెక్టర్ ఆదేశించినా, హాట్ స్పాట్ ప్రాంతాలను గుర్తించడంతో మునిసిపల్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని కొంతమంది కౌన్సిలర్లు కూడా వార్డుల్లో పారిశుధ్యాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుజూర్‌నగర్ మునిసిపాలిటీలోనూ, గ్రామాల్లోనూ ప్రజలు విష జ్వరాల స్వైర విహారంతో ప్రజలు తల్లడిల్లుతున్నారు.


హుజూర్‌నగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యం

పారిశుధ్య లోపంతో పెరుగుతున్న విష జ్వరాలు

పారిశుధ్య లోపంతోనే విష జ్వరాలు పెరుగుతున్నాయి. ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా కృషిచేయాలి. నీరు నిల్వలేకుండా చూడాలి. పగటి పూట దోమలు కుట్టటం వల్లే డెంగీ జ్వరాలు వస్తున్నాయి. ప్రజలు జ్వరాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి.

● పద్మ, సీహెచ్‌వో

డెంగీతో వ్యక్తి మృతి

తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామంలో డెంగీతో వ్యక్తి మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపర్తికి చెందిన రామగిరి ఉపేందర్ (59) బతుకుదెరువు కోసం ఏపీ రాష్ట్రం పిడుగురాళ్లకు వలస వెళ్లాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డెంగీ ఉందని వైద్యులు నిర్ధారించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు స్వగ్రామమైన గొట్టిపర్తికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.


ఉపేందర్ (ఫైల్ ఫొటో)

సాగు పాఠాలు నేర్చుకుంటూ..

● క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు ● పంటలపై రైతులకు సలహాలు, సూచనలు, అవగాహన


భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో వరి నాట్లు వేస్తున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు

భువనగిరి రూరల్, ఆగస్టు 26: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ సమాచారాన్ని అందించడంలో బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్న తరుణంలో విద్యారంగంలో సాంకేతికతను ప్రవేశపెట్టడం, విద్యార్థినులకు మేలు చేస్తోంది. వ్యవసాయ విద్యార్థులకు అవగాహన పెంచేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు దోహదం చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఏరువాక కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త కె. మమత పర్యవేక్షణలో భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి, వీరవెల్లి, అనాజీపురం, బొల్లేపల్లి, గౌస్‌నగర్, తాజ్‌పూర్, కూనూరు, ముత్తిరెడ్డిగూడెం, మోటకొండూరు గ్రామాలను ఎంపిక చేసుకున్నారు. ఈ నెల ఆగస్టు 12నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు మొత్తం నాలుగు నెలల పాటు గ్రామాల్లోనే పర్యటిస్తూ 46మంది విద్యార్థినులు నాగిరెడ్డిపల్లి గ్రామానికి ఆరుగురు విద్యార్థులు, మిగితా గ్రామాలకు ఒక్కో గ్రామానికి ఐదుగురు చొప్పున గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల నుంచి వ్యవసాయ సమాచారాన్ని, సర్వేల రూపంలో సేకరిస్తున్నారు. రైతులు ఎదుర్కొనే వాతావరణ పరిస్థితులు, వ్యవసాయంలో ఒడిదుడుకులు, పంటలను నష్టపరిచే చీడ పీడల సమస్యలను నిశితంగా గమనిస్తున్నారు. ఈ సమస్యలను శాస్త్రవేత్తలతో చర్చించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వంగడం రకం పేరు, మొక్క విత్తనం నాటిన సమయం వాటి జీవిత కాలం, ఆశించిన తెగుళ్లు, ఎరువుల వాడకం, దిగుబడి సాగు విధానం, నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై ఆయా గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

బీఎస్సీ విద్యార్థులకు ఎంతో ఉపయోగం



క్షేత్రస్థాయి పర్యటన విధానం వ్యవసాయ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. తరగతి గదిలో అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలు వినడంతో పాటు ఆయా గ్రామాల్లో నాలుగు నెలల పాటు పర్యటించి పంటల సాగు పరిశీలించడం, సాంకేతిక విషయాలను రైతులకు వివరించడం మంచి పరిణామం.

● డాక్టర్ బి. అనిల్‌కుమార్, ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త యాదాద్రి భువనగిరి జిల్లా.

అధిక మార్కులు సాధించే వీలు ఉంది



బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యలో భాగంగా క్షేత్రస్థాయిలో పంటలు సాగు వివరాలు తెలుసుకోవాల్సి ఉంటుంది. సాగు చేసిన పంటలు విత్తన నాటిన నుంచి కోసే వరకు దుక్కులు, విత్తనాలు నాటడం, పంటల యాజమాన్య పద్ధతి, దిగుబడి విధానాలు నేర్చుకున్న అంశాలు ఎంతో ఉపయోగపడతాయి. పరీక్షల్లోనూ అధిక మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

● తుమ్మల సౌజన్య, అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

దేవరకొండ, ఆగస్టు 26: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. సోమవారం దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లిగుట్టతండాకు చెందిన నేనావత్ నరేష్(20), సభావత్‌తండాకు చెందిన రాహుల్(18) ఫంక్షన్లలో డీజేలు నిర్వహిస్తుంటారు. ఆదివారం డిండి మండలంలో ప్రోగ్రాం పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో దేవరకొండ మండలం బొల్లిగుట్టతండా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో నరేష్, రాహుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. వాహనదారులు, పోలీసులు తీవ్రంగా గాయపడిన ఇద్దరిని దేవరకొండ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆదివారంరాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతులు ఇద్దరు అవివాహితులు. యువకుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


నరేష్, రాహుల్(ఫైల్‌ఫొటోలు)

బతుకుదెరువు కోసం వచ్చి అనంతలోకాలకు..

గుర్రంపోడు, ఆగస్టు 26 : బతుకుదెరువు కోసం వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పీఏపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన భూతరాజు సురేష్(30) ఆటోలో తిరుగుతూ గ్రామాల్లో ఉప్పు విక్రయిస్తుంటాడు. రోజు మాదిరిగానే సోమవారం తెల్లవారుజామున గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో ఉప్పు విక్రయించేందుకు వస్తున్నాడు. గ్రామ శివారులోని రాచకాల్వ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సనిమిత్తం దేవరకొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ అన్న భూతరాజు సైదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సురేష్(ఫైల్‌ఫొటో)

అవంతీపురం ఎస్‌బీఐ శాఖలో అగ్నిప్రమాదం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 26: షార్ట్‌సర్క్యూట్‌తో ఎస్‌బీఐ శాఖలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం ఎస్‌బీఐ శాఖలో సోమవారం జరిగింది. బ్యాంకు అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకృష్ణాష్టమి సెలవుదినం కావడంతో ఏసీలకు మరమ్మతులు చేయిస్తున్న క్రమంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి పొగలు వ్యాపించాయి. కొద్ది నిమిషాల వ్యవధిలో మంటలు వ్యాపించడాన్ని గమనించి బ్యాంక్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో ఫైర్‌ఆఫీసర్ యాదగిరి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో బ్యాంకులోని రెండు ఏసీలు, ఒక కంప్యూటర్, ఫర్నిచర్ దగ్ధం కాగా, సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బ్యాంకు మేనేజర్ రాకేష్ తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్వల్పంగా ఆస్తినష్టం జరగడంతో బ్యాంకు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె ...

డిండి: నల్లగొండ జిల్లా డిండి మండలంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గంగిరెద్దులను ఆడించే సారిక ఎల్లయ్య భార్య అలివేలు, కుమారుడు అంజి గ్రామంలో పూడిగుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం గుడిసెలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగిశాయి. ఇంట్లో నుంచి బయటకు వచ్చి కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి మంటలను ఆర్పారు. ఆ లోపునే ఇంట్లో వంటసామాగ్రి, దుస్తులు, టీవీ, ఇతరవస్తువులు పూర్తిగా కాలిపోయాయి. కట్టుబట్టలతో ఎల్లయ్య కుటుంబం బయటపడింది. గ్రామస్తులు రెవెన్యూఅధికారులకు సమాచారం అందించడంతో పంచనామా చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

తిప్పర్తి, ఆగస్టు 26 : నల్లగొండ జిల్లాకేంద్రంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. తిప్పర్తి మండలకేంద్రానికి చెందిన చిలక శ్రీనివాస్‌రెడ్డి(45) వ్యవసాయంచేస్తూ జీవిస్తుంటాడు. కాగా సోమవారం నల్లగొండలో నూతనంగా నిర్మించిన ఇంటిలో పనినిమిత్తం భార్య శ్రీలతతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇంటి లోపల ఇనుప స్టాండుపై నిలబడి గోడకు మేకు కొడుతుండగా గోడ లోపల ఉన్న విద్యుత్ వైర్‌కు మేకు తగిలి విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. స్టాండ్‌ను పట్టుకుని ఉన్న భార్యకు కూడా స్వల్పగాయాలయ్యాయి. స్పృహతప్పిన శ్రీనివాస్‌రెడ్డిని నల్లగొండలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డికి భార్యతో పాటు కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం తిప్పర్తిలోని స్వగృహానికి తరలించారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

సాగర్‌లో రెండు క్రస్ట్‌గేట్ల నుంచి నీటివిడుదల

నాగార్జునసాగర్/ కేతేపల్లి / మేళ్లచెర్వు, ఆగస్టు 26: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం రాత్రికి పూర్తిస్థాయినీటిమట్టం 590 అడుగులకు చేరింది. దీంతో 13, 14నెంబరు క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,217 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,557 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులతో పాటు రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి 16,200క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువ నుంచి 66,051 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

సాగర్ ప్రధాన డ్యాం సమీపంలో మొసలి

సాగర్ ప్రధాన డ్యాం సమీపంలో సోమవారం ఉదయం మొసలి కనిపించింది. పోలీసు కంట్రోల్ రూం వెనక రాళ్లపైన సీఆర్‌పీఎఫ్, ఎస్పీఎఫ్ సిబ్బంది మొసలిని గమనించారు భయందోళనతో సిబ్బంది కేకలు వేయడంతో మొసలి జలాశయంలోకి వెళ్లింది. ఈ నెల 13వ తేదీన డైవర్షన్ టన్నెల్ వద్ద సీసీ పుటేజీలో మొసలి కనిపించింది. మొత్తం మూడు మొసళ్లు ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఎవరూ నీళ్లలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పులిచింతలలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు వద్ద ఉన్న తెలంగాణ జెన్‌కో విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77 టీఎంసీఎలు) కాగా సోమవారం సాయంత్రానికి 174.83అడుగులుగా(45.51టీఎంసీలు) ఉంది. తెలంగాణ జెన్‌కో జలవిద్యుత్ కేంద్రం నుంచి నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 105 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 29,765 క్యూసెక్కులు కాగా ప్రాజెక్టు ఒక్క గేటును రెండు మీటర్లు ఎత్తి 17,628 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 33,268 క్యూసెక్కులుగా ఉంది.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో.. ఒక గేట్ నుంచి నీటి విడుదల

మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం 2వ నెంబర్ క్రస్ట్‌గేట్ అర అడుగు మేర ఎత్తి 454.97క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 622.21క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 645అడుగుల (4.46టీఎంసీలు) గరిష్ఠ మట్టానికి ప్రాజెక్టులో 643.30అడుగుల(4.02 టీఎంసీ) నీటిమట్టం ఉంది.

యాదగిరికొండపై హరిహరులకు పూజలు


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, ఆగస్టు 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మ వారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ ఉభయ ఆలయాల్లో అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.36,47,852ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారిని వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఈవో భాస్కర్‌రావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

నేడు ఆలయంలో తిరునక్షత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీవైష్ణవానాం కణ్ణన్ తిరునక్షత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ఈ ఉత్సవాల నేపథ్యంలో నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలు, శ్రీసుదర్శన నారసింహ హోమం, భోగాలు రద్దు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున (ఈ నెల 29న) శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 5గంటలకు శిక్యోత్సవం(ఉట్లు కొట్టుట), రాత్రి రుక్మిణీదేవి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మదర్ డెయిరీలో ఆరు డైరెక్టర్ పదవుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

● ఆరు డైరెక్టర్ పదవులకు సెప్టెంబర్ 13న ఎన్నికలు

హయత్‌నగర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సమితి లిమిటెడ్(మదర్ డెయిరీ) గత ఏడాది సెప్టెంబరు 30న ముగిసిన ముగ్గురి డైరెక్టర్ల పదవులకు, ఈ ఏడాది సెప్టెంబరు 30న ముగియనున్న ముగ్గురు డైరెక్టర్ల పదవులకు ఎన్నికలను నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు మదర్‌డెయిరీ ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. నార్మాక్స్ బైలా ప్రకారం ప్రతి ఏడాది ముగ్గురు డైరెక్టర్లకు ఎన్నిక నిర్వహిస్తారు. అనివార్య కారణాలతో గతేడాది ఎన్నికలు నిర్వహించలేకపోయామని ఆయన తెలిపారు. దీంతో ఈసారి ఆరు డైరెక్టర్ పదవులకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నిక పూర్తయ్యాక మదర్ డెయిరీ చైర్మన్‌ను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సెప్టెంబరు 4న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మదర్ డెయిరీలోని సమావేశమందిరంలో నామినేషన్లు స్వీకరణ ఉంటుందన్నారు. నామినేషన్ ఫీజు రూ.10వేలు కాగా, నామినేషన్ల పరిశీలన సెప్టెంబరు 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అదే రోజు 2 గంటల తర్వాత చెల్లుబాటు అయిన నామినేషన్ల జాబితా ప్రకటన, 6న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు 5గంటల తర్వాత అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు.

పోటీ లేకుంటే అదేరోజు ఫలితాలు ప్రకటిస్తామని, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. 13న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు హయత్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీకి ఎదురుగా ఉన్న ఎస్‌వీ కన్వెన్షన్‌లో ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు, గెలిచిన అభ్యర్థులకు లాటరీ పద్ధతి ద్వారా వారి పదవీ కాలం నిర్ణయించబడుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. అనంతరం చైర్మన్‌ను ఎన్నిక ఉంటుందన్నారు.

మాదక ద్రవ్య రహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యం



స్థానిక యువకులతో మాట్లాడుతున్న ఎస్ఐ సైదబాబు

నల్లగొండ రూరల్, ఆగస్టు 26 : నల్లగొండ మండలాన్ని మాదక ద్రవ్య రహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్ఐ సైదబాబు అన్నారు. మిషన్ పరివర్తనలో భాగంగా సోమవారం నల్లగొండ మండలం నర్సింగ్‌బట్ల గ్రామంలో స్థానిక యువకులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి నిర్మూలనకు యువత సహకారాలు అందించాలన్నారు. గంజాయి తీసుకున్న వ్యక్తుల కుటుంబాలకే కాకుండా సమాజానికి కూడా కీడు జరుగుతోందన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయికి బానిసగా మారితే రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జమిందార్ లక్ష్మయ్య, కానిస్టేబుల్ నర్సింహస్వామి, ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు బల్లెం ప్రవీణ్‌కుమార్, సభ్యులు తిరుమల సత్యనారాయణ, ఎం శేఖర్, శంకర్‌యాదవ్, నాగరాజు, రాము, అశోక్ పాల్గొన్నారు.

కార్మికుల ఉపాధి హరించే ఆలోచనలు చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నల్లగొండ రూరల్, ఆగస్టు 26 : మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇవ్వవద్దని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పోలె సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన మధ్యాహ్న భోజన వర్కర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సకాలంలో బిల్లులు రాకపోయినా మధ్యాహ్న భోజన కార్మికులకు భోజనం వండిపెట్టారని, అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అయినా ప్రభుత్వం ఏదో ఒక రోజు ఆలోచించి సరైన వేతనం ఇస్తూ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇస్తుందన్న ఆశతో పనిచేస్తున్నారని అన్నారు. కార్మికుల ఉపాధిని హరించేలా ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కరీమున్నీసా, నాయకులు మహేశ్వరీ, దేబోరా, ముత్యాలు, కృష్ణమ్మ, నిర్మల, అండాలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలి



థర్మల్ విద్యుత్ కేంద్రం పరిసరాల్లో విత్తన బస్తాలతో యువకులు

దామరచర్ల, ఆగస్టు 26: పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని ప్రకృతి సేవా అవార్డు గ్రహీత అవిరెండ్ల సందీప్‌కుమార్ అన్నారు. వనజీవి రామయ్య స్ఫూర్తితో మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్ యువత వేసవిలో సేకరించిన లక్ష విత్తనాలను మండలంలోని వీర్లపాలెం, థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో సేకరించిన నేరేడు, సుబాబ్, మామిడి, పొగడ విత్తనాలను ప్లాంట్ పరిసరాల్లో చల్లినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్, దైద శ్రీనివాస్, ఉబ్బపల్లి పవన్, రాజా, ప్రశాంత్, దైద పవన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: రాములు

వేములపల్లి, ఆగస్టు 26 : రాష్ట్రంలో టీడీపీ బలోపేతానికి టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సూచనలకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు, వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ భవన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో చంద్రబాబునాయుడు తగు సూచనలు చేశారన్నారు. ఆయన సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసి పలు స్థానాలను గెలుచుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గంలో త్వరలో సభ్యత్వ నమోదును చేపట్టి కార్యకర్తలకు బలం చేకూర్చేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.



చంద్రబాబునాయుడితో ముచ్చటిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు జడ రాములుయాదవ్

నేటి నుంచి కంఠమహేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



వేడుకలకు దీక్ష చేపట్టిన గీత కార్మికులు

కేతేపల్లి, ఆగస్టు 26 : మండలంలోని గుడివాడ గ్రామంలో గీతకార్మికుల ఆరాధ్య దైవం శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవిల కల్యాణవేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరస్వామి, వన మైసమ్మతల్లి, ఎల్లమ్మ తల్లి ఆలయాల్లో ఆయా దేవతామూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. వేడుకల్లో భాగంగా సోమవారం తోరణమాలాధారణ, పూజా కార్యక్రమం, మంగళవారం రెండో రోజు మంగళహారతులు, రుద్రాక్షధారణ, విభూదిధారణ, దేవతామూర్తుల ఊరేగింపు, బుధవారం మూడో రోజు భక్త సురమాంబ నాటక ప్రదర్శన, జలబిందెల సమర్పణ, గురువారం నాల్గో రోజు హోమం, విగ్రహాల ప్రతిష్ఠ, జలాభిషేకం, శుక్రవారం ఐదో రోజు పంచామృత స్నానం, గ్రామదేవలకు పూజలు, స్వామి కల్యాణం, శనివారం ఆరో రోజు బోనాలు, మొకు ముస్తాదు పూజలు చివరిదైన ఆదివారం వనదేవతలకు బలిప్రదానం, సహపంక్తి భోజనాలు ఉంటాయని వేడుకలను నిర్వహిస్తున్న గ్రామ దేవగౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు.

'తీన్మార్ మల్లన్నకు మంత్రిపదవి ఇవ్వాలి'

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 26: పట్టాభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు మంత్రిపదవి ఇవ్వాలని పలు కులసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా కుల సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ సంఘం నాయకులు మారం శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సమస్యలపై అవగాహన కలిగిన తీన్మార్‌మల్లన్నకు మంత్రి పదవి కల్పించడంతో సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుల సంఘాల జేఏసీ నాయకులు కొమ్ము శ్రీను, పొదిల శ్రీనివాస్, కాశయ్య, లబ్బుల్లా, బి. శ్రీనివాస్, అమృతారెడ్డి, బి. శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

● ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ● ప్రత్యేక పూజలు కల్యాణోత్సవాలు ● పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమాలు

శ్రీకృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా వేడుకలను జిల్లావ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. తమ చిన్నారులను శ్రీకృష్ణుడిగా, గోపికలుగా అలంకరించారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యాదవులు ఉట్టి కొట్టారు. పలు గ్రామాల్లోనూ సాయంత్రం ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



నల్లగొండలో కృష్ణుడు, రాధాదేవిల వేషధారణలో చిన్నారులు



శ్రీకృష్ణుడి వేషధారణలో బాలుడు



మిర్యాలగూడలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే బీఎల్ఆర్, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్





కట్టంగూరులోని లక్ష్మీనారాయణ దేవస్థానం ఎదుట, కేతేపల్లిలో ఉట్టి కొట్టేందుకు ప్రయత్నిస్తున్న యువకులు



రాధాదేవిగా చిన్నారి







చిట్యాలలో స్వామివారి ఊరేగింపు, డిండి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల కృష్ణ, రాధాదేవిల వేషధారణ, నల్లగొండలో ఉట్టి కొట్టే వేడుకను ప్రారంభిస్తున్న యాదవ సంఘ నాయకులు

పంటలు ఎండిపోతున్నాయ్...

● కాల్వలో నిలబడి రైతుల నిరసన

మాడ్గులపల్లి, ఆగస్టు 26: వరద కాల్వకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామ రైతులు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఈ మేరకు డీ-40 కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కట్టంగూరు మండలం బొల్లేపల్లి గ్రామం నుంచి మాడ్గులపల్లి మండలంలోని సీకేతండా వరకు 22కిలోమీటర్ల మేరకు డీ-40కాల్వ 27వేల ఎకరాల్లో ఆయకట్టు ఉందన్నారు. మూడు గ్రామాల మీదుగా డీ-40కాల్వ పరిధిలో నెల రోజుల క్రితం బోరుబావుల ఆధారంగా సాగు పనులు చేపట్టారు. కాల్వకు నీటిని విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని, పొలాలకు నీరు పారించుకోవచ్చని భావించామన్నారు. పానగల్ రిజర్వాయర్ నుంచి డీ-40కాల్వకు నీటిని విడుదల చేయాలని పలుమార్లు మంత్రి కోమటిరెడ్డికి, కలెక్టర్‌కు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రాలు అందచేసినా పట్టించుకోలేదన్నారు. తాము సాగు చేస్తున్న పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డీ-40 కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కొడూరు శ్రీను, కొడదల నాగేష్, కొడదలత వెంకటనర్సయ్య, తండు సైదులు, చింతపల్లి శ్రీను, యాదయ్య, రాజేష్ పాల్గొన్నారు.



కాల్వలో నిలబడి నిరసన తెలుపుతున్న రైతులు

రుణమాఫీ కోసం నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ రూరల్, ఆగస్టు 26 : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న రైతు రుణమాఫీ కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15 నాటికి పూర్తిచేస్తామని ప్రకటించి ఆచరణలో విఫలమైందన్నారు. రుణమాఫీ చేయకపోవడంతో రైతంగం తీవ్ర ఆందోళన, ఆవేదనకు గురవుతుందన్నారు. ఇప్పటివరకు రుణమాఫీ కాని రైతులందరూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నార్కెట్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ రాంమల్లేష్ మృతి

నార్కట్‌పల్లి, ఆగస్టు 26: సీపీఎం నాయకుడు, నార్కట్‌పల్లి మేజర్ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ దుబ్బాక రాంమల్లేష్(45) సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఓ పర్యాయం వార్డు సభ్యుడిగా,మరోసారి ఉపసర్పంచ్‌గా పనిచేశారు.ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాంమల్లేష్ మృతికి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

నకిరేకల్, ఆగస్టు 26 : నకిరేకల్ మండలం పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా కడారి అనిత, అధ్యక్షుడిగా వంటల ఆనంద్ బాబు, ప్రధానకార్యదర్శిగా చిక్కుల సుధాకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా వట్టె సైదులు, ఉపాధ్యక్షుడిగా నాగం అనిల్‌రెడ్డి, కోనేటి వెంకటయ్య, కదిరే శ్రీరాములు, మహిళా ఉపాధ్యక్షురాలిగా మూడుదుడ్ల పద్మ, ఉప్పు నవత, కార్యదర్శి నిమ్మశెట్టి భిక్షమయ్య, పొడిశేటి శంకర్, వేముల శ్రీను, మహిళా కార్యదర్శులుగా సురకంటి సునిత, కోసోజు కవిత ఎన్నికయ్యారు. ఎన్నిక అధికారులుగా గుడిపల్లి కుశలవరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

దేవరకొండ, ఆగస్టు 26 : దేవరకొండలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. దేవరకొండ లయన్స్‌క్లబ్ కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవలు అందిస్తోందని, క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, ప్రభాకర్, నిరంజన్, రాధకృష్ణ, అంజనేయులు, ఉషరాణి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లు పెంచాలి

వేములపల్లి, ఆగస్టు 26 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా ఆసరా పెన్షన్లను పెంచి బడుగు, బలహీనవర్గాలను ఆదుకోవాలని రాష్ట్ర దివ్యాంగుల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పుట్టల నాగయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4 వేల చొప్పున పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి నేటివరకు అమలు చేయకపోవడంలో ఆంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు. దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి ప్రోత్సాహకాలను అందించాలని ఆయన కోరారు.

చెప్పిందొకటి.. చేస్తోందొకటి: జూలకంటి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 26 : రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ చెప్పిందొకటి కాగా చేస్తోంది మరొకటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో రైతు సంఘాల నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.42 వేల కోట్లతో రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించి రూ.17వేల కోట్లు మాత్రమే చేయడం సరికాదన్నారు. సగభాగం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ లబ్ధి చేకూరిందని, అర్ధభాగం రైతాంగం ఆశగా ఎదురు చూస్తోందన్నారు. ప్రధానంగా ఎన్‌పీఏ రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, రైతు బంధు అమలు చేయాలన్నారు. సాగర్ ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉన్నందున రెండు పంటలకు సాగు నీరందించాలని, చెరువులు, కుంటు నింపాలని కోరారు. ఈ అంశాలపై ఈ నెల 29న రైతులతో కలిసి మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. రుణమాఫీ జరగని రైతులు, సంఘాల నాయకులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, దయానంద్, రవినాయక్, రామారావు, మంగారెడ్డి, ఎల్లయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేసిన మహనీయురాలు మదర్‌థెరిస్సా



దేవరకొండలో మదర్‌థెరిస్సా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 26 : పేదలకు, కుష్ఠు రోగులకు సేవలు అందించిన మహనీయురాలు మదర్‌థెరిస్సా అని నల్లగొండ దయాసిస్ పీఠాధిపతి రెవరెండ్ బిషప్ కరుణం ధమన్‌కుమార్ అన్నారు. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని నిర్మల్ హృదయ మందిరంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. థెరిస్సా తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిందని కొనియాడారు. అనంతరం కేక్‌కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, ఫాదర్స్ చిన్నపురెడ్డి, బాల్‌శౌరిరెడ్డి, రాయప్ప,సిస్టర్స్ రమ్య, ఎలేన్, అలెన్, పసల శౌరయ్య పాల్గొన్నారు.

దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భవనంలో మదర్‌థెరిస్సా 114వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, జయలక్ష్మీ, డ్యాన్స్‌మాస్టర్ జగన్‌లు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీధర్‌గౌడ్, రాము, కిషోర్, లక్ష్మి, ప్రతిభ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాలి

నకిరేకల్, ఆగస్టు 26: క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదులో ప్రతీ కార్యకర్త హాజరు కావాలని బీజేపీ నాయకుడు మండల వెంకన్న కోరారు. సోమవారం నకిరేకల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న నకిరేకల్ పట్టణంలో నిర్వహించే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్, నాయకులు గుడుగుంట్ల సాయన్న, డాకయ్య, వనం వేణు, కందాళ సైదులు, శ్రీకాంత్, రాములు, జానీ పాల్గొన్నారు.

ఈత వనానికి ఫెన్సింగ్ వేయించాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 26: ఈత వనానికి రక్షణగా ఫెన్సింగ్ వేయించాలని కోరుతూ మండలంలోని చిప్పలపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మిక సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వేముల వీరేశంకు విజ్ఞప్తి చేశారు.నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫెన్సింగ్‌తో పాటు రెండు విద్యుత్ స్తంభాలు వేయించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎస్ఈతో మాట్లాడి స్తంభాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ సాగర్‌రెడ్డి, బండ పురుషోత్తంరెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎస్‌సీ సెల్ మండల అధ్యక్షుడిగా రమేశ్

నార్కట్‌పల్లి, ఆగస్టు 26: కాంగ్రెస్ పార్టీ ఎస్‌సీ సెల్ మండల అధ్యక్షుడిగా గద్దపాటి రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్‌సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి విడుదల చేసిన నియామక ఉత్తర్వులను సోమవారం ఎమ్మెల్యే వీరేశం నుంచి రమేశ్ అందుకున్నారు. మండలంలో పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, నట్టు సత్తయ్య, జెరిపోతుల భరత్‌గౌడ్, మేడి శ్రీను, సిల్వేరు గిరి, అంజనేయులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

శాలిగౌరారం, ఆగస్టు 26: శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9గంటలకు శాలిగౌరారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణ తెలిపారు.సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి వారు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందుల, అద్దాలు ఇస్తారన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి సూర్యాపేట ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యనారాయణ కోరారు.

రైతులను మోసం చేస్తున్న సీఎం

కట్టంగూరు, ఆగస్టు 26: స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రుణమాఫీ పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుండాల నాగరాజు అన్నారు. కట్టంగూరులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులకిచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఎన్నికల్లో రైతుభరోసా ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు కూడా అమలు చేయలేదన్నారు.

సంక్షేమ నిధిని ఏర్పాటుచేయాలి

చండూరు, ఆగస్టు 26: గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటుచేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటి, ఈత వనాలపై గీత కార్మిక సొసైటీలకు పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. గీత వృత్తికి సమగ్ర చట్టం కల్పించి, దరఖాస్తు చేసుకున్న సొసైటీ, టీఎఫ్టీలకు లైసెన్సు వెంటనే మంజూరు చేయాలన్నారు. తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి మరణిస్తే పర్మినెంట్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకర్, మండల కార్యదర్శి గంట నగేష్, గండు కేశవులు, జోగు సురేందర్, కర్నాటి వెంకటేశ్, కాటెపల్లి నర్సింహ, పల్లె మల్లేష్ పాల్గొన్నారు.

ఐకాన్ అఛీవర్ అవార్డు అందుకున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 26: పట్టణానికి చెందిన సోషల్ వర్కర్, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్ యూనివర్సల్ ఐకాన్ అఛీవర్ అవార్డును సోమవారం అందుకున్నారు. హన్యానాయక్ సేవలను గుర్తించిన థాయ్‌లాండ్‌కు చెందిన పాల్ నారులా అకాడమీ ఈ అవార్డును ప్రకటించింది. బెంగుళూరులో జరిగిన ఇంటర్నేషనల్ సెమినార్‌లో అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని హన్యానాయక్‌కు అందజేశారు.



అవార్డుతో హన్యానాయక్